క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి సహాయం



ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి గరివిడికి చెందిన పేర్ల దమయంతి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుడు నర్సింహమూర్తి రూ.50,116 ఆర్థిక సహాయం చేశారు. బుధవారం ఆయన తన నివాసంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దిలీప్‌కుమార్ ధనూకా, ఒమ్మి రమేష్, గుడ్ల శ్రీను, నాగుకు నగదు అందజేశారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలు శిక్ష

బొండపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందని ఎస్ఐ కె.లక్ష్మణరావు హెచ్చరించారు. స్థానిక జాతీయ రహదారి–26పై మండల కేంద్రంతో పాటు చందకపేట జంక్షన్ వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని, వారికి వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలుంటాయని పేర్కొన్నారు. గంజాయి, మత్తు పదార్థాలను రవాణా చేస్తే కేసులు నమోదు చేసి, జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

వాహన తనిఖీలు

గజపతినగరం: స్థానిక జాతీయ రహదారిపై ఎస్ఐ యు.మహేష్ పోలీస్ సిబ్బందితో కలిసి బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపినా, లైసెన్స్ లేకపోయినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

ఎస్.కోటలో వైద్యశిబిరం



శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

శృంగవరపుకోట: స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటివైద్యం, క్యాన్సర్, ఎముకలు, గుండె, గైనకాలజీ, డెంటల్, జనరల్ విభాగాలకు చెందిన వైద్యులు సేవలందించారు. స్థానికులతో పాటు పలు గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సేవలందించారు.

ఎస్.కోట తహసీల్దార్‌గా అరుణకుమారి



బాధ్యతలు స్వీకరిస్తున్న అరుణకుమారి

శృంగవరపుకోట: మండల తహసీల్దార్‌గా ఎం.అరుణకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న వేళలో ఎస్.కోట ఎమ్మెల్యేగా కోళ్ల లలితకుమారి హయాంలో ఎస్.కోట తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత ఇతర మండలాలకు బదిలీపై వెళ్లారు. తాజాగా ఎన్నికల వేళ వచ్చిన తహసీల్దార్లు తమ సొంత జిల్లాలకు వెళ్లిపోవడంతో అరుణకుమారి తిరిగి ఎస్.కోటలో రెవెన్యూశాఖ పాలనా పగ్గాలు అందుకున్నారు.

రైతుబజార్‌లో తనిఖీలు



రైతుబజార్‌లో దుకాణాన్ని పరిశీలిస్తున్న రవికిరణ్

శృంగవరపుకోట: పట్టణంలోని రైతుబజార్‌లో డీఏటీ.ఎంఏ బి.రవికిరణ్ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రైతు బజార్ రికార్డులను, దుకాణాలు, విక్రయిస్తు న్న సరుకులు, కూరగాయలను పరిశీలించారు. ధరలపై దుకాణాల నిర్వాహకులను ఆరా తీశారు. వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా దుకాణాల వద్ద ధర ల పట్టికలు ఏర్పాటు చేయాలని ఈఓ సంతోష్‌కు సూచించారు. తూకంలో, నాణ్యతలో తేడాలు ఉన్నట్లు ఫిర్యాదులు అందితే ఉపేక్షించేది లేదని, నాణ్యమైన కూరగాయలను తక్కువ ధరకు వినియోగదారులకు ఇవ్వాలన్నదే రైతుబజార్ల లక్ష్యమని చెప్పారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం

- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- అవగాహన సదస్సులు, ర్యాలీలు



దత్తిరాజేరు: బిడ్డ ఆరోగ్యానికి పునాది, రక్షణ ఇచ్చేది అమ్మ పాలే. పుట్టిన వెంటనే బిడ్డకు ఇచ్చే ముర్రుపాలే భవిష్యత్‌లో ఆ బిడ్డకు వ్యాధులు రాకుండే చూసే తొలిటీకా. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లి పాలు ఎంతగానో దోహదపడతాయనడంలో సందేహం లేదు. నవజాత శిశువుకు లెక్కకు మించి పోషకాలను అందించేవి, బలం చేకూర్చేవి, ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడేవి తల్లి పాలే అని వరల్డ్ హెల్త్ ఆర్గనేషన్‌తో పాటు వైద్యనిపుణులు చెపుతున్నారు. తల్లిపాలలో సహజసిద్ధంగా ఉండే యాంటీబాడీలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. బిడ్డకు బాక్టీరియా, వైరస్‌లతో పోరాడే శక్తిని ఇస్తాయి. ఆరునెలల పాటు పూర్తిగా బిడ్డకు వేరే ఏ ఆహారం ఇవ్వకుండా తల్లిపాలు పట్టాలని వైద్యులు సూచిస్తున్నారు. తల్లి పాల వల్ల కలిగే ప్రయోజనాలపై చాలా మందికి అవగాహన లేక తమ బిడ్డలకు పాలు ఇవ్వకుండా డబ్బా పాలు ఇస్తున్నారు. ఫలితంగా పిల్లలో రోగనిరోధకశక్తి తగ్గి పలు రకాల వ్యాధుల బారినపడుతున్నారు. తల్లిపాల ఆవశ్యకతను వివరి స్తూ ప్రభుత్వం ఏటా ప్రభుత్వం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీవరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోందని ఐసీడీఎస్ పీడీ శాంతి కుమారి తెలిపారు.జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వారోత్సవాలు జరుగుతాయని ఆమె చెప్పారు. జిల్లాలో ఉన్న 8,740 మంది గర్భిణులు, 8,126 మంది బాలింతలకు ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు.

ఆరు నెలల పాటు ఇవ్వాలి

బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా ముర్రుపాలు పట్టించాలి. ఆరు నెలలు పాటు తల్లి పాలను మాత్రమే ఆహారంగా ఇవ్వాలి. తల్లిపాలు బిడ్డకు తేలికగా జీర్ణమవు తాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక శారీరక, వికాసానికి అవసరమైన పోషకాలు అందుతాయి. రోజుకు బిడ్డకు 8 నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలి. ఆరు నెలల తర్వాత పాలుతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి.

అవగాహన కల్పిస్తాం...

బిడ్డకు తల్లి పాలు అందించాల్సిన ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలకు వారం రోజుల పాటు అవగాహన కల్పించనున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,449 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆగస్టు 1 నుంచి తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయి.అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్, వైద్యసిబ్బందితో కలిసి తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– నాగమణి, ఐసీడీఎస్ పీఓ, గజపతినగరం

బాధ్యతల స్వీకరణ



చీపురుపల్లి: తహసీల్దార్ రాజారావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న సిబ్బంది



దత్తిరాజేరు: తహసీల్దార్ విజయభాస్కర్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

చీపురుపల్లి: మండల తహసీల్దార్‌గా ఎస్.రాజారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లాలోని బాడంగి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.తహసీల్దార్‌కు డీటీ సంతోష్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం సిబంది తో పలు అంశాలపై చర్చించారు.

దత్తిరాజేరు తహసీల్దార్‌గా విజయభాస్కర్

దత్తిరాజేరు: మండల తహసీల్దార్‌గా పి.విజయభాస్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డీటీ గౌరీ శంకర్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈయన విశాఖపట్నం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలో భూసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, వివాదాలు తలెత్తకుండా పని చేస్తా నని చెప్పారు.మండల సర్వేయర్ తిరుపతిరావు, భూసర్వే డీటీ రత్నకుమారి, సీఎస్‌డీటీ ధనలక్ష్మి, ఆర్ఐ రామ్‌కుమార్ పలువురు విఆర్వోలు ఉన్నారు.

స్పందించిన వైద్యారోగ్యశాఖ

సాక్షి ఎఫెక్ట్

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణతో పాటు జ్వరాలు ప్రబలకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి భాస్కరరావు తెలిపారు. 'ప్రబలుతున్న వైరల్ జ్వరాలు' అనే శీర్షికన జూలై 30న సాక్షిలో వెలువడిన కథనానికి జిల్లా వైద్యారోగ్యశాఖ స్పందించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ శాఖల సమన్వయంతో దోమల నివారణతో పాటు పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు యాంటీ లార్వా ఆపరేషన్లు చేస్తూ దోమల నివారణకు కృషి చేస్తున్నామని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దోమల లార్వా పెరగకుండా గంబూషియా చేప పిల్లలను చిన్న నీటి కుంటలు, చెరువుల్లో విడిచిపెడుతున్నామని, ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 52 వేల గంబూషియా చేపలు సరపరా చేశామని స్పష్టం చేశారు. గంబూషియా చేప పిల్లలు రాగానే అన్ని ప్రాంతాల్లోని చెరువుల్లో విడిచిపెడతామని పేర్కొన్నారు.

వరినారు చివర్లుతుంచి నాటుకోవాలి



బొండపల్లి: గరుడుబిల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లికార్జునరావు

బొండపల్లి: వరినారు చివర్లు తుంచి నాట్లు వేసుకోవడం వల్ల నారు ద్వారా పంటను ఆశించే చీడపీడలను నియంత్రించవచ్చని ఏఓ పి.వి.మల్లికార్జునరావు అన్నారు. గరుడుబిల్లి గ్రామంలో రైతులకు వరిసాగులో యాజమాన్య పద్ధతులు, పాటించాల్సిన మెలకువలపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. నారు చివర్లలో పంటకు హాని కలిగించే పురుగులు గుడ్లు పెడతాయని, చివర్లు తుంచి నాటు కోవడం ద్వారా వాటిని నివారించే అవకాశం కలుగుతుందన్నారు. ఏఈఓ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొ న్నారు.

నారును శుద్ధి చేసుకోవాలి

జామి: నాట్లు వేసే ముందు వరి నారును కట్టలు కట్టి సూడోమోనస్ పౌడర్ కలిపిన ద్రావణంలో అరగంటనుంచి గంటవరకు ఉంచి శుద్ధి చేసిన తర్వాత నాటుకుంటే తెగుళ్లను ఎదుర్కొనే శక్తి మొక్కకు పెరుగుతుందని ఏఓ కిరణ్‌కుమార్ అన్నారు. ఎ.ఆర్.పేట గ్రామంలో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. సూడోమోనస్ ద్రావణంతో నారును శుద్ధి చేయడం ద్వారా పాముపొడ ,అగ్గి తెగులు,మానిపండు తెగులును నివారించవచ్చని చెప్పారు. సూడోమోనస్ పౌడర్‌ను 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరపంటలతో అదనపు ఆదాయం

కొత్తవలస: అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం ఆర్జించవచ్చని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి ప్రకాష్ అన్నారు. గనిశెట్టిపాలెం గ్రామంలో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న సజ్జ పంట ను బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటల సాగుకు అయ్యే ఖర్చు లను అంతర పంటల సాగుతో వచ్చే ఆదాయంతో బర్తీ చేసుకోవచ్చన్నారు. అలాగే తెగుళ్లు, చీడపీలను అరికట్టవచ్చన్నారు. సజ్జ పంటలో అంతరపంటలుగా గోంగూర, తోటకూర, బెండ, చిక్కుడు, ఆనప పంటను సాగు చేసుకోవచ్చన్నారు.వీఏఏ దుర్గారావు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్త శ్రావ్య పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



టోల్ గేట్ పిల్లర్లపైకి దూసుకెళ్లిన లారీ

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం బీసీ కాలనీ వద్ద జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న టోల్‌గేట్ పిల్లర్లను బుధవారం తెల్లవారు జామున ఓ లారీ ఢీకొట్టింది. పెదమానాపురం పోలీసు స్టేషన్ సిబ్బంది తెలిపిన వివరాలు...రామభద్రాపురం నుంచి గజపతినగరం వైపు లోడ్‌తో వెళ్తున్న లారీ టోల్ గేట్ వద్ద పిల్లర్లపైకి దూసుకెళ్లింది. రెండు పిల్లర్లు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్,క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. అలాగే ఆ సమయంలో పక్కనే వేరే ఏవాహనాలూ లేకపోవడం వల్ల ముప్పు తప్పిందని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణ పనులకు రూ.లక్షల వరకు నష్టం జరిగినట్లు కాంట్రాక్టర్ నుంచి ఫిర్యాదు అందిందని హెచ్‌సీ కాశీరావు తెలిపారు.

అక్షరాస్యులకే అవకాశం కల్పించాలి

చీపురుపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీల(పీఎంసీ)కు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం తేదీలను ఖరారు చేసిన నేపథ్యంలో కమిటీల్లో అక్షరాస్యులకు మాత్రమే అవకాశం కల్పించాలని మండల బీజేపీ అధ్యక్షుడు ఇప్పిలి నీల కంఠం బుధవారం ఓ ప్రకటనలో కోరారు. అక్షరాస్యులు, పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ ఉన్న వారికి మాత్ర మే అవకాశం కల్పించాలని, అలా కాకుండా రాజకీయ ప్రమేయంతో ఎన్నికలు నిర్వహిస్తే కమిటీల సార్థకత ఉండదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా పీఎంసీ ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

ఓడీఎఫ్ సర్వే పరిశీలన



గుర్లలో సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజా

గుర్ల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీపీఓ ఎల్. శ్రీధర్ రాజా అన్నారు. మండలంలోని గుర్ల, గుజ్జింగివలసలో మండల పరిషత్ సిబ్బంది చేపట్టిన ఓడీఎఫ్ సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ బి.వెంకటరమణ ఉన్నారు.

పల్లె వెలుగు బస్సు సర్వీస్ ప్రారంభం

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి విశాఖపట్నానికి ఏర్పాటు చేసిన కొత్త ఆల్ట్రా పల్లెవెలుగు సర్వీసును ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి బుధవారం ప్రారంభించారు. డిపో మేనే జర్ కె.రమేష్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా పూజాధికాలు పూర్తి చేశారు. బస్సుకు జెండా ఊపి కొత్త సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణి కుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సర్వీసు లు నడపాలని, ఆదాయంతో పాటు సేవే ప్రధాన అజెండాగా ఆర్టీసీ పని చేస్తోందన్నారు. డిపోకు ప్రభుత్వం కొత్త బస్సులు కేటాయించేలా చూడాలని డిపో ఉద్యోగులు, స్థానికులు ఎమ్మెల్యేను కోరారు.

విద్యార్థులకు బ్యాడ్జ్‌లు బహూకరణ

శృంగవరపుకోట: కొత్తవలస మండలం వీరభద్రపురం గ్రామంలోని సూర్యోదయ డిఫెన్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో నిర్వహించిన ఎస్‌పీఎల్, ఏఎస్‌పీఎల్, సీపీఎల్ ఎన్నికల్లో గెలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం బ్యాడ్జ్‌లు బహూకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో పోటీ తత్వాన్ని, నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా, సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికి తీసేలా విద్యాబోధన జరగాలన్నారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

గుర్ల: గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్ఐ భాస్కరరావు తెలిపారు. మండల క్రేంద్రంలో చోడవరం–అచ్యుతాపురం జంక్షన్‌ల వద్ద పోలీసు సిబ్బందితో కలిసి బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహన చోదకులపై కేసులు నమోదు చేశారు.

పాఠశాలల సందర్శన



ముకుందపురం పాఠశాలలో పెరటితోటను పరిశీలిస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు

వేపాడ: మండలంలోని ముకుందపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. రికార్డులు, విద్యార్థుల వర్క్‌బుక్స్, పాఠశాల ప్రాంగ ణంలోని పెరటితోటను పరిశీలించా రు. విద్యార్థులకు రోజూ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, నాణ్యత, శుభ్రత పాటించాలని వంట నిర్వాహకులకు సూచించారు. చినగుడిపాల, నీలకంఠరాజపురం ఉన్నత పాఠశాలల్లో ఎంఈఓ–2 బాలభాస్కరరావు తనిఖీలు నిర్వహించారు. తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

నేటి గ్రామసందర్శన రద్దు

లక్కవరపుకోట/కొత్తవలస: కొత్తవలస,లక్కవరపుకోట మండలాల్లోని ముసిరాం, దాసుళ్లపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించాల్సిన గ్రామ సందర్శన కార్యక్రమాలను రద్దు చేసినట్లు ఆయా మండలాల ఎంపీడీఓలు కె.రూపేష్,రమణయ్య బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పంచాయతీ, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పింఛన్ పంపిణీ విధుల్లో పాల్గొననున్నారని, అందుకే గ్రామసందర్శనను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎరువుల పంపిణీ

జామి: జాగరం గ్రామ రైతుసేవాకేంద్రంలో రైతులకు ఎంపీటీసీ పాడిపిరెడ్డి ఎర్నాయుడు డీఏపీ, యూరియా ఎరువులను బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత రాకుండా అధికారులు చూసుకోవాలని అన్నారు. ఏఈఓ అజీజ్, గ్రామ పెద్దలు వసిరాము తదితరులు పాల్గొన్నారు.

గూడేంలో పారిశుద్ధ్య పనులు

గుర్ల: మండలంలోని గూడేం గ్రామంలో సర్పంచ్ ఎజ్జిపరుపు లక్ష్మణరావు బుధవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. వీధి కాలువల్లో పూడిక, చెత్తను పారిశుద్ధ్య కార్మికుల తో తీయించారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పనులను పంచాయతీ కార్యదర్శి ఉమ పర్యవేక్షించారు.

రోడ్డు మరమ్మతులు

వేపాడ: మండలంలోని సోంపురం వేపాడ ప్రధాన రహదారిలో ప్రధాన రహదారిలో వల్లంపూడి సమీపంలో ఎర్రచెరువు వద్ద గుంతలను సర్పంచ్ రుద్ర అంజలీ దేవి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం మరమ్మతులు చేశారు. గోతులను మెటల్,క్రషర్ బుగ్గితో పూడ్చి వేయించారు.



వల్లంపూడిలో రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న ఉపసర్పంచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

గంట్యాడ: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన తనిఖీలు చేశారు. ఓపీ రిజిస్టర్, మందుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, క్లోరి నేషన్ కార్యక్రమాలు చేయించాలని దిశా నిర్దేశం చేశారు. పీహెచ్‌సీకి వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చే వారికి సకాలంలో వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయాలని సూచించారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి డెంగ్యూ, మలేరియా పరీక్షలు చేయాలని చెప్పారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచా లన్నారు. ఇంటింటా కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వే చేసి వ్యాధి లక్షణాలు ఉన్న వారికి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు.ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యరాజ్, ఎంపీహెచ్ఈఓ ఎర్రన్న తదితరులు ఉన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

శృంగవరపుకోట: జిందాల్ కంపెనీ ఏర్పాటు కోసం వేల ఎకరాల భూములు ఇచ్చి నష్టపోయిన తమకు న్యాయం చేయాలని, తమ భూములు తమకు తిరిగి అప్పగించే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేయాలని జిందాల్ నిర్వాసిత రైతులు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. ఎస్.కోట ఆర్టీసీ డిపోలో ఎమ్మెల్యే లలితకుమారిని వైస్ ఎంపీపీ సుబ్బలక్ష్మితో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. నిర్వాసిత రైతులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జిందాల్ కంపెనీ వస్తే వేల మందికి ఉపాధి వస్తుందన్న ఉద్దేశంతో వైఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో భూములు ఇచ్చామన్నారు. 16 ఏళ్లు అయినా కంపెనీ ఏర్పాటు చేయకుండా ఇప్పుడు ఎంఎస్ఎంఈ పార్కు అని కొత్త పల్లవి అందుకున్నారని, భూములు కోల్పోయిన రైతులతో ఒక్క మాట కూడా చెప్పకుండా జిందాల్ ప్రతినిధులు అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటున్నారని వాపో యా రు. ఇప్పటికైనా తమకు జిందాల్ తీసుకున్న భూములు తిరిగి అప్పగించాలని, తమకు ఇచ్చిన పరిహారం మొత్తం తిరిగి చెల్లిందేకు సిద్ధం గా ఉన్నామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



కొత్తవలస: ఉపాధ్యాయుడు శివాజీ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, ఎమ్మెల్సీ రఘువర్మ



ఎల్.కోట: పంచాయతీ కార్యదర్శి సన్యాసిదేముడు దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు తదితరులు



గుర్ల: సీహెచ్ఓ సూరప్పుడు దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ, సిబ్బంది

లక్కవరపుకోట: ఏ ఉద్యోగికైనా ప్రజలకు అందించిన సేవలతోటో సమాజంలో గుర్తింపు వస్తుందని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అన్నారు. జమ్మాదేవిపేట గ్రామ పంచాయతీ గ్రేడ్–1కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన సుకురు సన్యాసిదేముడును ఎల్.కోట మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం సన్మానించారు. ఎంపీడీఓ కె.రూపేష్, ఈఓపీఆర్డీ జ్ఞానేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బెహరా సంతోష్‌కుమార్, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమాజాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడే..

కొత్తవలస: అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదని,సమాజాన్ని తీర్చిదిద్దే అరుదైన అవకాశం ఒక్క ఉపాధ్యాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు.వీరభద్రపురం ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జుక్కు శివాజీ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన్ని వీరభద్రపురంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బుధవారం సన్మానించారు.ఎంఈఓలు జి.శ్రీదేవి, బి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గేదెల త్రిమూర్తులు,టీడీపీ నాయకులు కోళ్ల శ్రీను,గొంప ఉమేష్,తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్ఓకు సన్మానం

గుర్ల: స్థానిక పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ అధికారిగా పనిచేస్తున్న నక్క సూరప్పుడు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆస్పత్రిలో బుధవారం ఆయన్ని ఎంపీడీఓ బి. వెంకటరమణ, వైద్యాధికారి చిన్నయ్య, సిబ్బంది సన్మానించారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

గజపతినగరం రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.36.80 కోట్లతో చేపట్టిన పనులపై మండల వ్యాప్తం గా ఆడిట్ బృందం ఇటీవల సోషల్ ఆడిట్ పూర్తి చేసింది. సంబంధిత నివేదికలపై మండల కేంద్రంలో డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం ప్రజావేదిక నిర్వహించారు. పలు గ్రామాల్లో సిబ్బంది వేతనదారుల మస్టర్ల దిద్దుబాట్లు, తదితర అక్రమాలు చేశారని పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ప్రజలు కోరారు. ఏపీఓ రామారావు, ఎంపీడీఓ ప్రసాద్, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ గార తవుడు,వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌వెల్‌నెస్ సెంటర్ సందర్శన



వెల్‌నెస్‌సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోడూరు గ్రామ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా టాస్క్‌ఫోర్సు బృందం బుధ వారం సందర్శించింది. రికార్డులతో పాటు సెంటర్‌లో అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశవర్కర్లు అందిస్తున్న సేవలు సంబంధిత పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయడం, గర్భిణులు,బాలింతలు, కౌమార బాలికలకు హెచ్‌బీ టెస్టులు నిర్వహిస్తున్న తీరుపై సిబ్బందిని ఆరా తీశారు. టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు డీపీహెచ్ఎన్ఓ సత్యవతి, ఎస్ఓ ధర్మారావు, డీపీఓ రామానుజుల నాయుడు, ఎన్ఆర్‌హెచ్ఎం శ్రీనివాస్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి, సీహెచ్ఓ సత్యం నాయుడు,హెల్త్ విజిటర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఉమాశంకర్, ఏఎన్ఎంలు మంగమ్మ,జయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు కవిత, రమణమ్మ పాల్గొన్నారు.

పాఠ్య,నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థినికి పుస్తకాలు అందజేస్తున్న జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి భీమశంకరరావు

కొత్తవలస: మండల కేంద్రానికి సమీపంలో చింతల దిమ్మ వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన నోట్, పాఠ్య పుస్తకాలను జిల్లా వృత్తివిద్యాశాఖ అధి కారి భీమ శంకరరావు బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 5వేల మంది విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్య, నోట్‌పుస్తకాలు సరఫరా చేసిందని చెప్పారు.ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.వి.ఎం.కృష్ణారెడ్డి, కళాశాల లైబ్రేరియన్ పద్మావతి, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీరాములు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో కిడ్నాప్ కలకలం!

ఎస్.కోట: తండ్రి ఈఎంఐ చెల్లించలేదని కొడుకును కిడ్నాప్‌చేశారన్న వార్త ఎస్.కోటలో బుధవారం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. వేపాడ మండలం అరిగిపాలెంకు చెందిన కాపగంటి సన్యాసిరావు తన భార్య రాజేశ్వరి పేరున ఎస్.కోటలోని ఫుల్లాన్ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ వద్ద రూ.60వేలు అప్పుతీసుకున్నాడు. నెలసరి వాయిదా సరిగా చెల్లించకపోవడంతో సంస్థ ఏజెంట్లు సాయంత్రం ఆయన ఇంటికి వెళ్లారు. ఆయన ఇంటివద్ద లేకపోవడంతో కిరాణా షాపు వద్ద ఉన్న కొడుకు కార్తీక్‌ను ఆరా తీశారు. మీ నాన్న అప్పు వాయిదా సరిగా చెల్లించడంలేదంటూ మండిపడ్డారు. తమతో రావాలంటూ బలవంతంగా కారు ఎక్కించి ఎస్.కోటలోని సంస్థ కార్యాలయానికి తీసుకెళ్లారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో కలవరపడ్డారు. తమ కుమారుడిని కిడ్నాప్ చేశారంటూ లబోదిబోమన్నారు. విషయం ఎస్.కోట పోలీసులకు తెలిసింది. వెంటనే పోలీసులు సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. కార్తీక్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆదేశించారు. విషయాన్ని వేపాడ మండలం వల్లంపూడి పోలీస్ స్టేషన్‌కు తెలియజేశారు. కుమారుడిని ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు బలవంతంగా తీసుకెళ్లడంపై సన్యాసిరావు, రాజేశ్వరరావు కలిసి వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. నెలసరి వాయిదా సరిగా వసూలు చేయాలన్నదే తమ అభిమతం తప్ప, ఎలాంటి కిడ్నాప్‌కు ప్రయత్నించలేదని, బెదిరించలేదని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.